

మొదటి దశ పనులు పూర్తి చేస్తాం

◆ గతేడాది కంటే ఎక్కువగానే నీళ్లు

◆ హంద్రీనీవా చీఫ్ ఇంజినీర్ కె.నాగరాజ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జులై రెండవ వారంలోపు మొదటి దశ హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు పూర్తవుతాయని హంద్రీనీవా చీఫ్ ఇంజనీర్ కె.నాగరాజ తెలిపారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హంద్రీనీవా సుజల స్రవంతి పురోగతిపై పలు విషయాలు తెలియజేశారు.



కె.నాగరాజ

ప్ర : హంద్రీనీవా అభివృద్ధి పనులు ఎప్పటిలోపు పూర్తవ్వొచ్చు.?

సిఇ : హంద్రీనీవా మొదటి దశ కాలువ వెడల్పు పనులు నడుస్తున్నాయి. అదే సమయంలో రెండవ విడత లైనింగ్ పనులు జరుగుతున్నాయి. మొత్తం 12 ప్యాకేజీల్లో ఈ పనులు నడుస్తున్నాయి. మొదటి దశ కాలువ వెడల్పు పనులు జులై రెండవ వారంలోపు పూర్తవ్వొచ్చని అంచనా వేస్తున్నాం. ఇక రెండవ దశ లైనింగ్ పనులు ఇప్పటి వరకు 25 శాతం పూర్తయ్యాయి. తక్కిన నీళ్లు వచ్చే వరకు సాధ్యమైనంత త్వరగా పనులు చేపడతాం. నీళ్లు వస్తే అక్కడితో ఆపి వచ్చే సీజన్‌లో లైనింగ్ పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్ర: ఈ ఏడాది అనంతపురం జిల్లాకు హంద్రీనీవా ద్వారా నీళ్లు ఏ మేరకు వచ్చే అవకాశముంది ?

సిఇ : గతేడాది కంటే ఈసారి నీళ్లు ఎక్కువగానే వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నాం. ఇప్పుడిప్పుడే శ్రీశైలం డ్యామ్‌కు నీళ్లు వస్తున్నాయి. జులై రెండవ వారంలోపు మొదటి దశ కాలువ వెడల్పు పనులు పూర్తవుతే నీళ్లు పూర్తి స్థాయిలో తీసుకునే అవకాశముంది. గతేడాది జిల్లాకు 30 టిఎంసిల నీళ్లను తీసుకున్నాం. ఈసారి 50 టిఎంసిల వరకు నీళ్లను హంద్రీనీవా ద్వారా తీసుకునేందుకు వీలుంటుందని అంచనా వేస్తున్నాం. గతేడాది కంటే కాలువ సామర్థ్యం పెరిగినందున సాధ్యమైనంతగా ఎక్కువ నీళ్లే జిల్లాకు వచ్చే అవకాశముంది.



ప్ర: భైరవానితిప్ప, పేరూరు ఎత్తిపోతల పథకం పరిస్థితి ఏమిటి.?

సిఇ : భైరవానితిప్ప, పేరూరు ఎత్తిపోతల పథకం ఇంకా భూ సేకరణ జరగాల్సి ఉంది. ఇది వరకే దీనికి సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వం వద్దనున్నాయి. భూసేకరణ పూర్తవగానే ఈ ప్రాజెక్టు పనుల్లోనూ పురోగతి ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

ప్ర : సిఎల్‌డిపి సామూహిక బిందుతుంపెర సేద్యం ప్రాజెక్టులో కదలికొచ్చే అవకాశముందా ?

సిఇ : సిఎల్‌డిపిలో సామూహిక బిందు,తుంపెర సేద్యం ప్రాజెక్టు పనులు తిరిగి ప్రారంభమయ్యే అవకాశాలైతే ఉన్నాయి. ప్రభుత్వానికి నివేదిక పంపించాం. అనుమతులొచ్చాక పనులు ప్రారంభం అవుతాయి.



అక్రమాల ప్లానింగ్..!

◆ అనుమతి ఒకలా.. నిర్మాణం మరోలా..!

◆ ఇంటి పేరుతో వ్యాపార సముదాయం నిర్మాణం

◆ పెనుకొండలో అస్తవ్యస్తంగా టౌన్ ప్లానింగ్ విభాగం

పెనుకొండ పట్టణంలో కొన్నింటి గృహాలకు అనుమతులు ఒకలా తీసుకుని నిర్మాణాలు మరొకరకంగా చేస్తున్నారు. ఇంటి నిర్మాణాల పేరుతో అనుమతులు తీసుకుని వ్యాపార సముదాయాలను నిర్మించేస్తున్నారు. ఇలాంటి వాటిని నియంత్రించాల్సిన అధికారులే అడ్డదారిన అనుమతులు ఇచ్చేస్తూ అక్రమాల'ప్లానింగ్'కు అనుమతులు ఇస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ పంచాయతీ స్థాయి నుంచి నగర పంచాయతీగా రూపాంతరం చెందింది. దశాబ్ద కాలంగా పట్టణ ప్రాంతం పెరగడంతో నిర్మాణాలు పెరిగాయి. ఇదే సమయంలో కొందరు నిర్మాణాల్లో అక్రమాలకు తెరలేపారు. కళ్లేదుటే వ్యాపార భవన సముదాయాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మూడేళ్ల క్రితం ఇంటి నిర్మాణానికి తీసుకుని పదుల సంఖ్యలో వ్యాపార భవనాలను నిర్మిస్తున్నా అధికారులు ఏమీ ఎరుగనట్లు వ్యవహరించడం చర్చనీయాంశమైంది. అనుమతులు లేకనే పెద్ద పెద్ద భవనాలు నిర్మాణాలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. పెనుకొండ నగరపంచాయతీ పరిధిలో వైసిపి పాలనలో అక్రమ భవనాలు, అనుమతులు లేని నిర్మాణాలు విచ్చలవిడిగా జరిగాయనే విమర్శలున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ దానికి కొనసాగింపుగా ఈ నిర్మాణాలు జరుగుతుండడం గమనార్హం.

మూడేళ్ల క్రితం ఇంటి నిర్మాణానికి అనుమతులు

పెనుకొండ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి జిఐసి కాలనీలో ఇంటి నిర్మాణం కోసం 2021జూలై నెలలో రూ.84వేలు ఆన్‌లైన్లో చలానా చెల్లించి అనుమతులు తీసుకున్నారు. ఆ సమయంలో ఇంటి నిర్మాణానికి అనుమతులు తీసుకుని వ్యాపార భవన సముదాయాలు నిర్మిస్తున్నారని ఆ వార్డు కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి నిర్మాణ పనులను అడ్డగించారు. ఇదే సమయంలో అప్పటి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి భవన యజమానికి మద్దతు పలికారు. వైసిపి ప్రభుత్వం ఉండడంతో వ్యాపార సముదాయాల నిర్మాణం చేయకుండా అప్పట్లో అడ్డుకున్నారు.

యథేచ్ఛగా వ్యాపార భవనసముదాయాల నిర్మాణం

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం వైసిపి పాలనలో ఆగిన నిర్మాణ పనులను భవన యజమాని మళ్లీ ప్రారంభించారు. ఈ నిర్మాణం అనుమతులు ఇంటి నిర్మాణానికి తీసుకుని మరొకటి చేస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా నగర పంచాయతీ ఆదాయానికి గండి పడింది. ఇదేక్కటే కాదు పట్టణంలో ఎక్కడ చూసినా అనధికార భవన నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం స్పందించడం లేదు. పట్టణంలో పలు ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు భవనాల వైపు కన్నెత్తి చూసిన దాఖలాలే లేవు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతోనే లేక తమకెందుకులే అని భావించి ఇలా వ్యవహరిస్తున్నారన్న చర్చ పట్టణంలో జోరుగా సాగుతుంది.

పేదల నిర్మాణాలకు మాత్రం అడ్డంకులు

బడాబాబుల నిర్మాణాలు పట్టించుకోని అధికారులు నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు మరుగుదొడ్లు నిర్మిస్తున్నా వెంటనే వచ్చి వాలిపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేస్తున్నారంటూ పేదలను లక్ష ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రెండు మూడు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా ఎందుకు స్పందించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అస్తవ్యస్తంగా టౌన్ ప్లానింగ్ విభాగం

పెనుకొండ మేజర్ పంచాయతీ స్థాయి నుంచి నగర పంచాయతీ అయ్యింది. పేరుకు నగర పంచాయతీ అయినా టౌన్ ప్లానింగ్ విభాగం మాత్రం అస్త్యవస్తంగా తయారైంది. ఆ విభాగంలో పూర్తి స్థాయి అధికారులు లేరు. గతంలో ఇద్దరు ఇన్‌ఛార్జి టౌన్ ప్లానింగ్ అధికారులు ఉండేవారు. వారిపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో వారిద్దరూ సొంత స్థానాలకు వెళ్లిపోయారు. అప్పటినుంచి పెనుకొండ నగర పంచాయతీకి టౌన్ ప్లానింగ్ అధికారి లేరు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



పట్టణంలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతుంటే చర్యలు తీసుకుంటాం. ఇంటి నిర్మాణానికి అనుమతులు తీసుకుని వ్యాపార భవన సముదాయాలు నిర్మించరాదు. నివాస ప్రాంతాల్లో భవన నిర్మాణం ఉంటే వాటికి పన్నులను విధిస్తాం. అనుమతులు లేకుండా నిర్మాణాలు ఉంటే నిబంధనల మేరకు కూల్చివేస్తాం.

సతీష్ కుమార్, కమిషనర్.



జిఐసి కాలనీలో ఇంటికి అనుమతి తీసుకుని వ్యాపార సముదాయానికి జరుగుతున్న నిర్మాణం



అనుమతుల్లేకుండా జరిగిన రెండు అంతస్తుల భవన నిర్మాణం..

నో డ్యూ సర్టిఫికెట్ కోసం పడిగాపులు



కార్పొరేషన్ కార్యాలయం వద్ద వేచి ఉన్న మహిళా సచివాలయ పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఉమ్మడి అనంతపురం జిల్లా సచివాలయం మహిళా పోలీసులకు సోమవారం నాడు బదిలీల ప్రక్రియ జరగనుంది. ఈ కౌన్సిలింగ్‌కు తప్పనిసరిగా నో డ్యూ సర్టిఫికెట్‌తో రావాలనే నిబంధన అమలు చేశారు. దీంతో ఈ సర్టిఫికెట్‌ను పొందేందుకు మహిళా పోలీసులు కార్పొరేషన్ కార్యాలయం వద్ద పడి కాపులుకాశారు. అనంతపురం నగరంలోని 74 సచివాలయాల మహిళా పోలీసులు ఈ సర్టిఫికెట్ కోసం కార్పొరేటషన్ కార్యాలయం వద్ద గంటల తరబడి వేచి ఉన్నారు. సర్టిఫికెట్ ఇవ్వాల్సిన డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని కోసం ఎదురు చూశారు. ఈమె అందుబాటులోకి రాకపోవడంతో మహిళా పోలీసులు రాత్రి పొద్దుపోయే దాకా అక్కడే వేచి ఉన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉండటంతో గుమాస్తా శరత్ మహిళా పోలీసుల సర్టిఫికెట్‌లను సేకరించారు. బదిలీ ప్రక్రియ మొదలయ్యే సమయానికి తమకు నోడ్యూ సర్టిఫికెట్ ఇవ్వాలని మహిళా పోలీసు సచివాలయ సిబ్బంది కోరారు.

టిడిపి సీనియర్ నాయకులకు సన్మానం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని టిడిపి ప్రజావేదిక కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ గోళ్ల లక్ష్మీదేవి రమేష్, నాయకులు చౌలం మల్లికా ర్జున, డికె.రామాంజనేయులు, పార్టీ మండల అధ్యక్షులు గోళ్ల వెంకటేషులు, ఎస్సీ, ఎస్టీ నాయకులు కొల్లాపురప్ప, సింగిల్‌విండో అధ్యక్షులు మల్లిపల్లి నారాయణ, మార్కెట్ యార్డు డైరెక్టర్ ధనుంజయ నాయక్, లాయర్ ఆంజనేయులు, కురుబ నాగరాజులను ఘనంగా సన్మానించారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మండలంలోని బోరంపల్లి గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ప్రముఖ వైద్యులు గుండె, కిడ్నీ, తదితర దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా చికిత్స చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే సహకారంతో గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహి స్తున్నారు. గ్రామీణ ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే ఉద్దేశంతో ముందుజాగ్రత్తగా అందరికీ ఉచిత వైద్య సేవలు అందిస్తున్నన్నారు. శిబిరంలో టిడిపి నాయకులు ఆదినారాయణరెడ్డి, రంగారెడ్డి, రామాంజనేయులు, మల్లికార్జున, మారెప్ప, గోపాల్‌రెడ్డి, గంగిరెడ్డి, సి.వెంకటేషులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో ఎనుము దూడ మృతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

చిరుతదాడి చేయడంతో ఎనుము దూడ మృతి చెందిన సంఘటన శెట్టూరు మండలంలోని చిన్నంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. చిన్నంపల్లి గ్రామ సమీపంలో రైతు జనార్ధనకు చెందిన ఎనుము దూడపై శనివారం అర్ధరాత్రి చిరుతదాడి చేసి చంపింది. చిరుత దాడి ఘటనలో సమీప గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

హృదయ సంస్కారం 'లోసరి' కవిత్వం

కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

'ఆయుధం లాంటి మనిషి' పుస్తక పరిచయ సభ

ప్రజాశక్తి--అనంతపురం

హృదయ సంస్కారం లోసరి సుధాకర్ రచనల్లో కనిపిస్తుందని కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఉపాధ్యాయ భవనంలో రచయిత లోసరి సుధాకర్ రచించిన 'ఆయుధం లాంటి మనిషి' పుస్తక పరిచయ కార్యక్రమం జరిగింది. సాహితీ స్రవంతి నాయకులు ప్రగతి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి 'ఆయుధం లాంటి మనిషి' పుస్తకావిష్కరణ అనంతరం పుస్తక పరిచయాన్ని చేశారు. కవిత్వంలో రచించిన అంశాలను వివరించారు. మనిషి కోరుకున్న స్వేచ్ఛ, సౌహార్థాత సుధాకర్ రచనలో కనిపిస్తుందని తెలియజేశారు. పేద ప్రజల సమస్యలను కవితా వస్తువుగా తీసుకుని ఆయుధం లాంటి మనిషి కవితా సంపుటిని తీసుకొచ్చారని తెలిపారు. డీఎస్పీ శివారెడ్డి మాట్లాడుతూ సామాన్య ప్రజల సమస్యలను కవితల రూపంలో సుధాకర్ తీసుకొచ్చారని చెప్పారు. అన్ని శీర్షికలు చాలా గొప్పగా ఉన్నాయని కొనియాడారు. ప్రగతి మాట్లాడుతూ సుధాకర్ తన రంగంలో ఉంటూనే కవిత్వాన్ని ప్రవృత్తిగా రాణించడం అభినందనీయమన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ మాట్లాడుతూ సుధాకర్ కవిత్వం పిజి విద్యార్థులకు సిలబస్‌గాను పనికొస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పి.సురేష్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని పరిచయం చేస్తున్న రాచపాలెం తదితరులు

ఎన్‌డిఎ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలన్నీ నిర్వీర్యం

లౌకికతత్వానికి పొంచి ఉన్న ప్రమాదం

కాంగ్రెస్, కమ్యూనిస్టుల ఐక్య పోరాటాలతోనే పునర్ వైభవం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-కుందుర్పి

కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం లౌకికతత్వానికి ప్రమాదం తెచ్చిపెట్టేలా పాలన సాగిస్తుందని, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని ఎదుర్కొని దేశాన్ని సమైక్య వాదం దిశగా తీసుకెళ్లడానికి కమ్యూని స్టులు, కాంగ్రెస్ పార్టీ కలిసి ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి ఉద్ఘాటించారు. కామ్రేడ్ లక్ష్మన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం కుందుర్పిలో జరిగిన స్తూపం ఆవిష్కరణ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథు లుగా పాల్గొని మాట్లాడారు. ఎన్‌డిఎలోని పెద్దలు రాజ్యాంగ వ్యవస్థలను వారి చేతుల్లోకి తీసుకొని పాలన సాగిస్తున్నారన్నారు. రాజ్యాంగ సవరణ చేయాలన్న బిజెపి ఆలోచనను తిప్పి కొట్టడానికి కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలతో కలిసి వచ్చే పార్టీలను కలుపుకొని పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజకీయంగా భేదాభిప్రాయాలు ఉన్న రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సి ఉన్నా, బనకచర్ల-గోదావరి నదుల అనుసంధానం చేస్తారంటూ దీనికి రూ. 82వేల కోట్లు అవసరం అవుతుందని చంద్రబాబు పదే పదే చెప్తున్నారని మండిపడ్డారు. 36 ఏళ్లుగా హంద్రీనీవా, గాలేరు-నగరి, వెలుగొండ టన్నెల్ పూర్తి చేయకుండా కొత్త ప్రాజెక్టులను ప్రారంభిస్తామని చంద్రబాబు చెప్పడాన్ని తప్పుపట్టారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీరు అందివ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సర్పంచి మారుతీశ్వరి రామ్మూర్తి, ఎంపిపి కమలా నాగరాజు, కాంగ్రెస్, సిపిఐ, ఎఐవైఎఫ్, ఎఐఎస్‌ఎఫ్, టిడిపి, వైసిపి, నాయకులు పాల్గొన్నారు.



కామ్రేడ్ లక్ష్మన్న వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్.రఘువీరారెడ్డి

తాడిపత్రికి పెద్దారెడ్డి

◆ ఏడాది తర్వాత తన ఇంటికి

◆ అడ్డుకున్న పోలీసులు

◆ బలవంతంగా అనంతపురం తరలింపు

◆ రెడ్‌బుక్ రాజ్యాంగం అంటూ ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, తాడిపత్రి

సార్వత్రిక ఎన్నికల అనంతరం తాడిపత్రిలో నెలకొన్న వివాదం ఇంకా చల్లారలేదు. ఎన్నికల అనంతరం తాడిపత్రికి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని రానించేది లేదంటూ మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు అనుమతి ఇచ్చినా శాంతిభద్రతల కారణం చూపి పెద్దారెడ్డిని పోలీసులు తాడిపత్రి వెళ్లేందుకు అనుమతించలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం పెద్దారెడ్డి ఎవరికీ తెలియకుండా తాడపత్రికి వెళ్లారు. యల్లనూరులోని తన స్వగ్రామం నుంచి తాడిపత్రిలోని తన నివాసానికి ఉదయం 7-30 గంటలకు వెళ్లారు. పెద్దారెడ్డి వచ్చిన విషయం తెలియగానే పోలీసులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా తాడిపత్రికి ఉండేందుకు వీల్లేదంటూ పెద్దారెడ్డికి తెలిపారు. ఈ సమయంలో పెద్దారెడ్డి పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఇంట్లో తాను ఉండేందుకు వీల్లేదని చెప్పడం ఏమిటంటూ ప్రశ్నించారు. అయినా పోలీసులు వినకుండా బలవంతంగా ఆయన్ను నంతపురం పంపారు.

ఎన్నికల అనంతరం తాడిపత్రిలోకి నో ఎంట్రీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి పర్యటనను తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. ఎన్నికల ఫలితాలొచ్చిన సమయంలోనే తాడిపత్రి వెళితే దాడులకు సిద్ధపడ్డారు. దీంతో ఆయన్ను బయటకు పంపించారు. అప్పటి నుంచి పోలీసులు ఆయన పర్యటనకు అనుమతించడం లేదు. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. తాడిపత్రి పట్టణంలోకి అనుమతించాలని కోరుతూ వేసిన పిటిషన్‌పై ఐదు వాహనాల్లో తగిన భద్రతతో అనుమతించాలని కోర్టు ఉత్తర్వులిచ్చింది. ఆ ఉత్తర్వులు వెలువడిన తరువాత కూడా వివిధ కారణాలతో పోలీసులు ఆయన పర్యటనకు అనుమతించ లేదు. తాజాగా పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే నేరుగా ఆదివారం ఉదయం తాడిపత్రిలోని ఆయన నివాసానికి పెద్దారెడ్డి చేరుకున్నారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ఆయన్ను వెనక్కు పింపించారు.

పెద్దారెడ్డి మాత్రమే మా శత్రువు

జెసి.ప్రభాకర్‌రెడ్డి

'తమ శత్రువు పెద్దారెడ్డి మాత్రమేనని, వైసిపి కార్యకర్తలు కాదని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి తెలియజేశారు. ఆదివారం నాడు ఈయన ఓ వీడియో విడుదల చేశారు. ఇప్పటి వరకు తాము న్యాయపరంగా మాత్రమే వెళ్తున్నామని చెప్పారు. వైసిపి నాయకులు జైళ్లు బాగా కట్టించుకోండి అని చెబుతున్నారని, తాము ఇప్పుడే రఫ్ఫారఫ్ఫా ఆడిస్తే వారి పరిస్థితి ఏమిటన్నారు. పెద్దారెడ్డి అధికారంలో ఉన్నప్పుడు తన ఇంటికి వచ్చిన విషయాన్ని మర్చిపోయారంటూ ప్రశ్నించారు. పెద్దారెడ్డితో ఉంటే ఎవరినీ వదలమన్నారు.



పెద్దారెడ్డిని బలవంతంగా ఇంటి నుంచి బయటకు తీసుకొస్తున్న పోలీసులు

ఎంతకాలం అడ్డుకుంటారో చూస్తాం :పెద్దారెడ్డి

తాను తాడిపత్రికి వెళ్లేందుకు హైకోర్టు అనుమతులు ఇచ్చినా పోలీసులు జెసి.ప్రభాకర్‌రెడ్డి మాటలు విని అడ్డుకుంటున్నారని, ఇలా ఎంత కాలం అడ్డుకుంటారో చూస్తామని పెద్దారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన అనంతపురంలో వైసిపి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జెసి.ప్రభాకర్‌రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని తనను అడ్డుకుంటున్నారని, ఎళ్లకాలం ఈ రాజకీయాలు చెల్లవని, తమ టైం వచ్చినప్పుడు తాము కూడా ఇంతకింత చేస్తామని పెద్దారెడ్డి తెలిపారు. ఏ చట్టాల ప్రకారం పోలీసులు పెద్దారెడ్డిని తాడిపత్రికి అనుమతించడం లేదో చెప్పాలని మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్ ప్రశ్నించారు. ఇలాగే పోలీసులు అడ్డుకుంటూపోతే జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట బైఠాయిస్తామని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి చెప్పారు. రాష్ట్రంలో భారత రాజ్యాంగం కాకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు జరుగుతోందని మాజీ ఎంపి తలారి రంగయ్య విమర్శించారు.



హనుమంతరెడ్డిని అభినందిస్తున్న అభిమానులు

మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం ఛైర్మన్ హనుమంతరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన కేక్ కట్ పలువురికి తినిపించారు. అనంతరం ఆయనను మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులు, సిబ్బంది శాలువాలు, పూలదండలతో సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'శ్రీరామిరెడ్డి' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

2న కళ్యాణదుర్గం నుంచి పాదయాత్ర ప్రారంభం - సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులకు వేతన బకాయిలు, పిఎఫ్ చెల్లించేంత వరకూ పోరాడుతామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు స్పష్టం చేశారు. పట్టణంలోని పంపుహౌస్ వద్ద ఆదివారం నాయకులు ఎర్రిస్వామి అధ్యక్షతన కళ్యాణదుర్గం శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయ్ స్కీం వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించగా జి.ఓబులుతో పాట సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యద ర్శులు నాగమణి, నాగేంద్ర హాజరయ్యారు. ఓబులు మాట్లాడుతూ బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లించా మని ఎస్ఈ చెప్పిన మాటలు వాస్తవం కాదన్నారు. పైగా 24గంటల్లో పనిలో చేరకపోతే చర్యలు తీసుకుంటామని నోటీసు ఇవ్వడం సబబు కాదన్నారు. అలాగే ఫేజ్-1, ఫేస్-4, మడకశిర, హిందూ పురం, పరిగి, బెళుగుప్ప కార్మికులకు బకాయిలు చెల్లించే వరకూ సమ్మె కొనసాగుతుందని తీర్మానం చేశారు. జులై 1వ తేదీ ఆయా గ్రామాల్లో కరపత్రాల పంపిణీ, బైక్ యాత్ర, 2వ తేదీ కళ్యాణదుర్గం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి పాదయాత్రను ప్రారంభించి 5వ తేదీ అనంతపురంలోని కలెక్టరేట్‌కు చేరుకొని కలెక్టర్‌కు మెమొరాండం ఇస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి వర్కర్స్ కోశాధికారి వన్నూరుస్వామి, నరేష్, రమేష్, రామాంజనేయులు, రాము, హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

సిపిఎం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలోని శ్రీశ్రీ నగర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నాడు ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. డాక్టర్ గోపాల్ పర్యవేక్షణలో కాలనీవాసులకు కంటి పరీక్షలను నిర్వహించారు. కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ కాలనీవాసులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



డాక్టర్‌ను సన్మానిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి www.prajasakti.com

గతుకుల రోడ్లలో..గగనంగా..

గుంతలమయమైన గ్రామీణ రోడ్లు - శింగనమల నుంచి తరిమెల వరకూ అదే పరిస్థితి

లింకు రోడ్లూ అంతే.. - ఆందోళనలో వాహనదారులు

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రం నుంచి తరిమెల వైపు గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణం గగనంగా మారుతోందని వాహనదారులు వాపోతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి తరిమెల గ్రామం వరకూ నిత్యం వేలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. శింగనమల నుంచి గోవిందరాయునిపేట, చిన్నమట్లగొంది, పెద్దమట్లగొంది, నాయనవారిపల్లి, సలకంచెరువు, రాచేపల్లి, ఆనందరావుపేట, రాచేపల్లి, నిదనవాడ, తరిమెల గ్రామాల మీదుగా తరిమెలకు వెళ్లాలి. దీనికితోడు ఆయా గ్రామాల రైతులు, కూలీలు నిత్యం తోటల వద్దకు ఇదే రోడ్డులోనే వెళ్లాల్సి ఉంది. తోటల వద్దకు వెళ్లాలంటే అర్ధరాత్రి, అపరాత్రి అంటూ ఏమీ ఉండదు. ఎప్పుడంటే అప్పుడు రైతులు తోటల వద్దకు వెళ్తూ ఉంటారు. ఈనేపథ్యంలో గతుకుల రోడ్డుతో గమ్యస్థానాలకు చేరుకుంటామా.. లేదా.. అనే ఆందోళనలో వాహనదారులు వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా శింగనమల దెయ్యం గుండు మలుపు వద్ద చాలా ప్రమాదకరంగా మలుపుతోపాటు కంపచెట్లు పెరిగాయి. రాత్రిళ్లు ఈ దారిలో వెళ్లాలంటే గుండెలు చేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గోవిందరావుపేట కొండ కింద నుంచి గ్రామంలోకి తారురోడ్డు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిదనవాడ గ్రామం నుంచి అనందరావుపేట గ్రామం మెయిన్ రోడ్డు రస్తాకు ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తరిమెల -కల్లుమడి మధ్యలో రోడ్డు సరిగా లేకుండన ద్విచక్ర వాహనం ఎదురొచ్చినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. లారీలు క్రాస్ నుంచి ఆకేలేడు, గురుగుంట్ల గ్రామం వరకూ రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఇరుకుగుండటంతోపాటు గుంతలమయంగా మారింది. ఇక ఇల్లూరు గ్రామం నుంచి ఏకులనాగేపల్లి, గుమ్మేపల్లి గ్రామాల రోడ్డు సరిగ్గా లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా రోడ్లను బాగు చేయాలని గ్రామాల రైతులు, వాహనదారులు ప్రజలు కోరుతున్నారు.





గుంతలు ఏర్పడిన శింగనమల - తరిమెల రోడ్డు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

వ్యక్తిత్వ వికాస కావ్యం 'మానవీయం'

విజయవాడ అదనపు ఎస్పీ సుధాకర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జీవితంలో ఎదురైన ఎన్నో ఒడిదుడుకులు, దు:ఖాలను అధిగమిస్తూ ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్ అధినేత రాధేయ రచించిన 'మానవీయం' కావ్యం ఒక వ్యక్తిత్వ వికాస కావ్యమని విజయవాడ ఎస్పీ కవిలోసారి సుధాకర్ అన్నారు. ప్రభుత్వ కళాశాల (స్వ)లోని కామర్స్ సెమినార్ హాల్లో తెలుగు శాఖ, ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 'మానవీయం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత్వం ఉన్న మనిషి కరువైపోతున్న కాలంలో 'మానవీయం' కావ్యం వెలువడటం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో 'స్పందన' ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి, తూముచర్ల రాజారామ్, డాక్టర్ ప్రగతి, డాక్టర్ బి. హేమమాలిని, ప్రముఖ విమర్శకుడు అంకే శ్రీనివాస్, ప్రముఖ సాహితీవేత్త శాంతినారాయణ, తరిమెల అమరనాథరెడ్డి, ప్రిన్సిపాల్ పురుషోత్తమరెడ్డి, అరుణ, ఉపప్రధాని వెంకటేశులు, ఎస్ఎం బాషా, గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, లక్ష్మీరెడ్డి, రంగనాయకులు, తదితర సాహితీవేత్తలు పాల్గొన్నారు.

రాప్తాడులో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

రాప్తాడు : రాప్తాడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈమేరకు దళిత, గిరిజన, బిసి, మైనారిటీ, అభ్యుదయ సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు, అధికారులు, పోలీసు అధికారుల సమక్షంలో విగ్రహ దాత ప్రొఫెసర్ రాజేష్‌తో విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కటిక జయరాం, భీమ్‌రావ్ యువజన సంఘం నాయకులు, దళిత సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అంగన్వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం



మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్-2లో పని చేస్తున్న చేస్తున్న కార్యకర్త వడ్డే పద్మావతి ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె అంత్యక్రియల కోసం సూపర్‌వైజర్ ధనలక్ష్మి రూ.15వేల మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ నాయకురాలు అధ్యక్షులు రత్నమ్మ, కార్యదర్శి కాత్యాయని, కోశాధికారి సుభాషిణి, అంగన్వాడీ వర్కర్లు అశ్విని, అక్కమ్మ, నారాయణమ్మ, పండ్ల తోటల రైతు సంఘం సీనియర్ నాయకులు వి.శివారెడ్డి, రైతు సంఘం నాయకులు ఆర్.కుళ్లాయప్ప, సిఐటియు మండల కార్యదర్శి సి.నాగేంద్ర, రైతుసంఘం నాయకులు సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలోని ఒక అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు సుంకర మునిశేఖర్(50) బిసి వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో అవుట్ సోర్సింగ్ కింద కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. 2019లో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఆతడికి ఇద్దరు భార్యలున్నట్లు ప్రాథమిక సమాచారం. ఇద్దరితోనూ కుటుంబ కలహాలున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారం సాయంత్రం అరవిందనగర్‌లోని సాయి ఎన్క్లేవ్ వద్దకెళ్లి ఐదవ అంతస్తు పైనుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టుటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక ఉపకారాగారం తనిఖీ

గుత్తి : అనంతపురం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.రాజశేఖర్ గుత్తిలోని ప్రత్యేక ఉపకారాగారాన్ని ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కారాగారంలోని రికార్డులు, బ్యారెకులు, వంటగది, స్టోర్ గది, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో ఆయన సమావేశమయ్యారు. సమస్యలు ఏమైనా ఉన్నాయని అడిగారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ముందుగా జైలు వద్ద ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపకారాగారం సూపరింటెండెంట్ వి.మహేశ్వరుడు, కోర్టు లైజన్ ఎస్.సాదిక్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ గోవిందుకు పరామర్శ

గుత్తి : టిడిపి ఎస్సీ విభాగం నాయకులు, మాజీ కౌన్సిలర్ కోనేటి గోవిందును టిడిపి నాయకులు ఆదివారం పరామర్శించారు. గోవింద ఇటీవల బెంగళూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో బైపాస్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ మోదీ శ్రీనివాస్ యాదవ్, టిడిపి నాయకులు ఎస్ఎం బాషా, బోయ వేణుగోపాల్ తో పాటు పలువురు నాయకులు గోవింద నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జె.సుంకన్న, మాజీ సర్పంచి గద్దల తిరుపాల్, నాయకులు జె.మస్తాన్, నారాయణ, వడ్డే రామాంజనేయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుత్తి : పట్టణంలోని మాల్యస్ స్మిత్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాఠశాలలో 1974 -75 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివి స్థానికంగా అలాగే ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డ వారందరూ ఒకే వేదికపై కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు రామకృష్ణశర్మ, గంగాధర్, నూకల సూరి, రమేష్, బాబా ఫక్రుద్దీన్, నాగరంగ ప్రసాద్, వి.వెంకటేష్, శంకర్, రియాజుద్దీన్, గురుస్వామి, మారుతి, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తనిఖీ

గుంతకల్లు రూరల్ : పట్టణ శివారు ప్రాంతంలోని ఎస్టేట్ సమీపంలో ఎసిటిఒ గోపీచంద్ ఆధ్వర్యంలో సేల్స్‌ట్యాక్స్ అధికారులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా అగ్గిపెట్టెలు తీసుకెళ్తున్న ఓ లారీని నిలిపి రికార్డులను పరిశీలించారు. కొన్ని బిల్లులు తప్పుగా ఉండడంతో జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిగుమతి ఎగుమతి సుంకాలలో వ్యాపారులు అవకతవకలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మకం సుంకాలు సక్రమంగా వసూలు చేయడంతో పాటు తప్పుడు సరుకు రవాణాను అరికట్టడానికి తమ సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉన్నారని వివరించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

యల్లనూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఒహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ

ఉరవకొండ : మండల పరిదిలోని బుదగవిలో ఒహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణ పనులకు టిడిపి నాయకులు చిరంజీవి ఆదివారం భూమిపూజ చేశారు. పయ్యావుల సోదరులు సహకారంతో దాదాపు రూ.35లక్షలతో తాగునీటి ట్యాంకును నిర్మిస్తున్నట్లు తెలిపారు. నూతన తాగునీటి ట్యాంకు నిర్మించడంతో గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం పయ్యావుల సోదరులు చూపారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కెకె కులప్ప, మేటి విరుపన్న, బండే గౌడ్, రామస్వామి, భీమన్న, చక్రి, అఖిల్, తిమ్మప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై స్పెషల్ డ్రైవ్

ఉరవకొండ : ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు ఉరవకొండ గ్రామ పంచాయతీలో ఆదివారం పారిశుధ్య పనులపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందులోఉ భాగంగా అంబేద్కర్ నగర్, నెహ్రూ కాలనీల్లో కాలువల్లో పూడిక తీసి చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సతీష్‌కుమార్, సెక్రటరీ గౌస్‌సాహెబ్, వార్డు మెంబర్ మీనుగ రామాంజనేయులు, ఎస్సీ సెల్ వరప్రసాద్, 120వ బూత్ కన్వీనర్ సాకే మల్లికార్జున, తిప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట నిరసన

అనంతపురం : వైసిపి పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీరాజ్ వ్యవస్థలో అవినీతి, స్థానిక ప్రజాప్రతినిధుల హక్కుల ఉల్లంఘనకు సంబంధించి రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో అవినీతిపై విచారించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న కలెక్టరేట్ వద్ద నిరసనకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా గురుసదన్ 3వ వార్షికోత్సవ వేడుకలు

అనంతపురం సిటీ : నగరంలోని అంబేద్కర్ భవన్ పక్కన ఉన్న గురుసదన్ ప్రత్యేక వసతి గృహంలో 3వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వెంకటేశ్వర ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సంస్థ ఫౌండర్ తాళంకి శశి గుప్తా తాళంకి వెంకటేష్ గుప్తా ఆధ్వర్యంలో గురుసదన్ డైరెక్టర్ తాళంకి వెంకట సామ్రాట్ గుప్త అధ్యక్షతన ట్రస్టు ద్వారా అందిస్తున్న సేవలను పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో షిరిడీ సాయి అన్న వితరణ ట్రస్టు అధ్యక్షులు చెక్కా సుబ్రమణ్యం, ముత్యాల రెడ్డి మిల్క్ డైరీ రాజశేఖర్, సిఎ ఆడిటర్ సందీప్‌గుప్తా, విశ్రాంత తహశీల్దార్ ముత్యాలరెడ్డి, తాళంకి దివ్య, సందీప్, తదితరులు పాల్గొన్నారు.



తాళంకి వెంకటేష్ గుప్తా దంపతులను సన్మానిస్తున్న ట్రస్టులో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిపిఎం ఆధ్వర్యంలో ఐ మిత్రా విజన్ సెంటర్ సౌజన్యంతో నగరంలోని శ్రీశ్రీనగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, హాయ్ మిత్ర విజన్ సెంటర్ వ్యవస్థాపకాలు పులిపాటి గోపాల్, ఐమిత్ర విజన్ సెంటర్, కో ఆర్డినేటర్ నాగరాజు ప్రారంభించారు. అనంతరం వైద్యులు కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కంటి శుక్లాలు అవసరమైన పదిమందికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయనున్నట్లు ఐ మిత్ర విజన్ సెంటర్ నిర్వాహకులు అన్నారు. అనంతరం సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ మనిషికి కంటి చూపు ఎంతో అవసరమన్నారు. ఆరోగ్యంతో పాటు కళ్ల సంరక్షణకు ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలన్నారు. అలాగే వైద్య శిబిరం ఏర్పాటు చేసిన ఐమిత్ర విజన్ సెంటర్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శ్రీశ్రీ నగర్ శాఖ కార్యదర్శి వలి, నగర కార్యవర్గ సభ్యులు ప్రకాష్, నగర కమిటీ సభ్యులు బాలకృష్ణ, జీవా, తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షకు వచ్చిన వారితో మాట్లాడుతున్న వైద్యులు

2 నుంచి 'ఇంటింటికీ టిడిపి'

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు వచ్చేనెల 2వతేదీ నుంచి 'సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ టిడిపి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈమేరకు మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఓవైపు సంక్షేమం.. మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ సుపరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. తాము చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి ఇంటింటికీ తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే టిడిపి నాయకులు అన్ని విధాలుగా దుష్ప్రచారాలు చేస్తూ వైసిపి బురదజల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏడాది కాలంలో సుపరిపాలన అందించామన్న సంతృప్తి మాతోపాటు రాష్ట్ర ప్రజల్లో కూడా ఉందన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాలను కూడా అమలు చేస్తామన్నారు. కావున జూలై 2 నుంచి ప్రతి కార్యకర్త, నాయకుడు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

కెమికల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన



లోహిత ఫార్మా ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు


ప్రజాశక్తి-రాయదుర్గం

డి.హీరేహాల్ మండలంలోని ఓబుళాపురం గ్రామంలో నెలకొల్పుతున్న లోహిత ఫార్మసీ కెమికల్ ఫ్యాక్టరీ, ఇతర కెమికల్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయకూడదని ఆ గ్రామ ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. పలువురు గ్రామస్తులు ఆదివారం లోహిత ఫార్మా కెమికల్ ఫ్యాక్టరీ నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. నిర్మాణ దశలో ఉన్న భవనాలను పరిశీలించారు. లోహిత ఫార్మా ఫ్యాక్టరీ నిర్మాణ స్థలం వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కర్నాటకలోని బళ్లారి ఇండస్ట్రియల్ ఏరియాలో కెమికల్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయగా ఆ ఫ్యాక్టరీల వల్ల చర్మ రోగాలు, ఆస్తమా, క్యాన్సర్, తదితర రోగాల బారిన పడుతున్నామని ఆ ప్రాంతంలోని ముంద్రిగి గ్రామ ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేయడంతో వాటిని ఓబుళాపురం గ్రామ చుట్టుపక్కల నెలకొల్పాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఈ కెమికల్ ఫ్యాక్టరీ వల్ల వెలువడే గ్యాస్ వల్ల చిన్నపిల్లలు, ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కావున వీటి ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు సందర్శించి వీటి ఏర్పాటును వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు.

టిడిపి కార్యదర్శి ప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి-గుత్తి

వచ్చే కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఒసిసిఐ) ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో టిడిపి గుత్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బత్తల మారుతీప్రసాద్, సతీమణి మహాలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఒసిసిఐ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షురాలు డి.లక్ష్మీదేవమ్మ మాట్లాడుతూ వడ్డే సామాజిక వర్గానికి చెందిన మారుతీప్రసాద్‌ను టిడిపి అధిష్టానం గుర్తించి పదవి ఇవ్వడం అభినందనీయమన్నారు. టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి బత్తల మారుతీప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులు గెలుపునకు కృషి చేస్తానన్నారు. వడ్డే కులస్తుల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానన్నారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, పట్టణ అధ్యక్షులు ఎంకె చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒసిసిఐ రాష్ట్ర నాయకులు డి.వరదరాజులు, సూర్యవంశం వడియ రాజులు సంఘం మండల అధ్యక్షుడు చిరంజీవి, ఒసిసిఐ నాయకులు రామాంజనేయులు, నాగరాజు, వెంకటేష్, హనుమంతు, రాజు, తదితరులు పాల్గొన్నారు.



టిడిపి కార్యదర్శి ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

గూగూడు కుళ్లాయిస్వామి అగ్నిగుండం ఏర్పాటు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండం ఏర్పాటు పనులు మొదలుపెట్టారు. నియమ నిష్టలతో అగ్నిగుండం పనులు పూర్తి కాగానే అగ్నిగుండంలో నిప్పులు వేశారు. దాదాపు వారం రోజులపాటు అగ్నిగుండం భక్తులు వేసే మొద్దులు, కలపతో మండుతూనే ఉంటుంది. ఉత్సవాల 10వరోజు సోమవారం తెల్లవారు జామున కుళ్లాయిస్వామి అగ్నిగుండ ప్రవేశం చేస్తారు. సోమవారం నుంచి కుళ్లాయి స్వామి ఆలయంలో కొలువుదీరుతారు. దీంతో నిత్య పూజ నివేదనలు ప్రారంభమవుతాయి. మంగళవారం నుంచి గూగుడుకు భక్తుల రద్దీ పెరుగుతూనే ఉంటుంది. వేడుకల్లో ప్రధానంగా చిన్న సరిగెత్తు, పెద్ద సరిగెత్తు, కుళ్లాయిస్వామి అగ్నిగుండ ప్రవేశం, జలధి వంటి కార్యక్రమాలకు భక్తులు భారీగా తరలివస్తారు. ఇక కుళ్లాయి స్వామి చివరి దర్శనం రోజు లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. ఈమేరకు ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులు భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.



గూగూడు గ్రామంలో అగ్నిగుండం ఏర్పాటు చేస్తున్న గామస్తులు



హారాన్ని అందజేస్తున్న దృశ్యం

కుళ్లాయిస్వామికి వెండిహారం బహూకరణ

గూగూడు కుళ్లాయిస్వామికి అనంతపురానికి చెందిన పుల్లా గోపీనాథ్‌యాదవ్ ఆదివారం వెండిహారాన్ని బహుకరించారు. సుమారు 2.5 కిలోల వెండిహారాన్ని ఆలయ నిర్వహణ అధికారి సాకేతపురం శోభ, ఆలయ ప్రధానార్చకులు హుస్సేనప్పకు అందించారు. ఈ కార్యక్రమంలో జాఫర్‌వలి, పిఒ రాజన్న, పి.నరసింహులు, పిఒ ఓబులేసు, నాగలింగప్ప, రోశన్న గారి రాజన్న, మాజీ డీలర్ ఓబులేసు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిని కాపాడుకుందాం

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులకు నాణ్యమైన, నైతిక విలువలతో కూడిన విద్యను అందించే ప్రభుత్వ బడులను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు లింగమయ్య పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై ఉన్న నమ్మకంతో తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేరుస్తారన్నారు. వారికి చదవడం, రాయడంతోపాటు, నైతిక విలువలు నేర్పడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని కోరారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్చడానికి డ్రైవ్ చేపట్టాలని కోరారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య మాట్లాడుతూ పాఠశాల ప్రారంభ దినాల నుండి విద్యలో వెనుకబడిన విద్యార్థులకు చదువుపై ఆసక్తిని కల్పించడానికి కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయ వృత్తిలో వచ్చే సమస్యలపై పోరాటం చేస్తూనే విద్యార్థులకు విద్య నేర్పడంలో చిత్తశుద్ధిని ఉపాధ్యాయులను ప్రదర్శించాలని కోరారు. యుటిఎఫ్ శ్రేణులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి నిరంతరం భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, జిల్లా కార్యదర్శులు అబ్దుల్ వహాబ్‌ఖాన్, శేఖర్‌రాముడు, సుబ్బరాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

స్థానిక సంస్థల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

హర్యానా సదస్సుకు వెళ్లకుండా చేసేందుకు కుట్ర-మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలు, ప్రజాప్రతినిధుల హక్కులను కాలరాస్తోందని మేయర్ మహమ్మద్ వసీం మండిపడ్డారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసినటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై 3, 4వతేదీల్లో హర్యానాలోని గురుగ్రామ్‌లో 'రాజ్యాంగ ప్రజాస్వామ్యం మరియు జాతి నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర' అనే అంశంపై రెండు రోజులపాటు జరిగే జాతీయ సదస్సు వైసిపి మేయర్లు, ఛైర్మన్లు, డిప్యూటీ మేయర్లు, డిప్యూటీ ఛైర్మన్‌లు వెళ్లకుండా చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన ఏకపక్షంగా ఉందనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులను గౌరవించటం తెలియలేదా? అని నిలదీశారు. రాజ్యాంగపరంగా తమకు కల్పించిన హక్కులను కాలరాస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విజయవాడ, అనంతపురం, కడప, తిరుపతి మేయర్లకు ఆహ్వానం అందకపోవడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు ఏకపక్ష విధానాలపై కేంద్రం స్పందించాలని డిమాండ్ చేశారు.




విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం

ఎమ్మెల్యే అమిలినేనిది మచ్చలేని కుటుంబం

నారా లోకేష్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంతకల్లు

కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కుటుంబం మచ్చలేనిదని నారా లోకేష్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం టిడిపి డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ హిమబిందు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అమిలినేని కుటుంబం అంటే మచ్చలేని కుటుంబంగా పేరుందన్నారు. అలాంటి ఆయనపై నిరాధారమైన ఆరోపణలు చేయడం వైకాపా నేతలకు తగదన్నారు. ఎస్పీ జగదీష్ సైతం ఎస్ఆర్‌సి సంస్థకు క్లీన్ చీట్ ఇచ్చారన్నారు. ఈ స్టాంపుల కుంభకోణం కేవలం మీసేవ నిర్వాహకుల వల్లే జరిగిందని చెప్పారన్నారు. సురేంద్రబాబు కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి వైసిపి నేతలు ఓర్వలేకపోతున్నారన్నారు. ఎమ్మెల్యేగా సురేంద్రబాబు దాదాపు వెయ్యి మంది నిరుద్యోగ యువతకు ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇచ్చారన్నారు. నారా లోకేష్ జన్మదిన సందర్భంగా సురేంద్రబాబు ఏర్పాటు చేసిన మెగా బ్లడ్ క్యాంప్‌లో సుమారు వెయ్యికి పైగా యూనిట్ల రక్తాన్ని సమీకరించినందుకు గవర్నర్‌తో ప్రశంసాపత్రం అందుకున్నారన్నారు. అదేవిధంగా అభయ ఫౌండేషన్ మరియు ఎస్ఆర్సి సహకారంతో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణతో పాటు మిషన్లను అందజేశారన్నారు. వీటితోపాటు కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. అలాంటి ఆయన కుటుంబపై నిరాధార ఆరోపణలు చేయడం బాధాకరమనాన్రు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణ, టిడిపి సీనియర్ నాయకులు బ్రహ్మయ్య, లోకేంద్ర, కదిరప్ప, రమణ, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆనంద్‌రెడ్డి